క్లుప్తంగా

పరిష్కార వేదికలో అర్జీలు నిల్

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించామని తహసీల్దార్ పి.జాహ్నవి సోమవారం తెలిపారు. ఈ సదస్సులో ప్రజల నుంచి ఒక్క అర్జీ కూడా రాలేదని తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు నేరుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని చెప్పారు.

నేడు విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు మంగళవారం స్మైలీ హాస్పిటల్ వారిచే మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దారా వినోద్‌బాబు, చింతల తిరుపతయ్య తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ధరణికోట పెన్షనర్స్ భవనంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో వారు మాట్లాడుతూ నిష్ణాతులైన వైద్యులతో సంఘ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జరుగు ఈ శిబిరంలో ఈసీజీ, 2 డి ఎకో, థైరాయిడ్, కిడ్నీ, ఆర్థో, షుగర్, బీపీ వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్మశానవాటిక ఆక్రమణదారునిపై చర్యకు వినతి

కంచికచర్ల: దళితుల శ్మశానవాటికను ఆక్రమించి ప్రహరీగోడ కట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని తక్షణమే ఆ గోడను తొలగించాలని ప్రముఖ న్యాయవాది జై భీమ్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కంచికచర్లలోని సర్వే నంబర్ 539-1లో 1.45 ఎకరాలను ప్రభుత్వం దళితుల శ్మశానవాటికకు కేటాయించారని ఆ శ్మశాన వాటికకు ఆనుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారి కపిల్ హోం అనే పేరుతో వెంచర్ వేసి శ్మశాన వాటికను ఆక్రమించి ప్రహరీ నిర్మించారన్నారు. ఆ గోడను తక్షణమే తొలగించి, ఆ వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

తొలగించిన వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

కంచికచర్ల: ఎంపీపీ పాఠశాలలో తొలగించిన స్కూల్ శానిటేషన్ వర్కర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని సీఐటీయూ నాయకుడు సోమేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గండేపల్లి ఎంపీపీ స్కూల్‌లో స్కూల్ శానిటేషన్ వర్కర్‌గా గట్టిగుండె ఇందిర గత ఆరేళ్ల నుంచి పనిచేస్తోందని, కూటమి నాయకులకు తలొగ్గిన ఎంఈఓ ఎటువంటి నోటీసు ఇవ్వకుండా తొలగించారని అన్నారు. శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్న ఇందిరకు పదేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతి చెందాడని, ఉన్న ఒక్క కుమారుడు కూడా ఐదేళ్ల క్రితం మృతి చెందాడని వితంతువు, ఒంటరి మహిళ అని కూడా చూడకుండా కక్షపూరితంగా ఆమెను విధుల్లో నుంచి తొలగించారని మండిపడ్డారు. ఇందిరను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.వేంకటేశ్వరరావు అర్జీ ఇచ్చారని తెలిపారు.

భూముల రీ సర్వేతో సరిహద్దు వివాదాల పరిష్కారం

నందిగామటౌన్: భూముల రీ సర్వేతో సరిహద్దు వివాదాలకు తావుండదని తహసీల్దార్ సురేష్‌బాబు అన్నారు. రీసర్వే ప్రాజెక్టుకు ఎంపికైన మండలంలోని కొణతమాత్మకూరు గ్రామంలో సోమవారం రెవెన్యూ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రీ సర్వేపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రీ సర్వేతో భూములకు సంబంధించి వివాదాలు సమసిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ స్వామి, ఆర్ఐ లావణ్య, రాంబోధ్యానాయక్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

10న హుండీ కానుకల లెక్కింపు

నందిగామటౌన్: మండలంలోని అంబారుపేట గ్రామంలో ఉన్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో ఈ నెల 10న అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలను లెక్కిస్తున్నట్లు ఈవో హరిగోపీనాథ్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు దేవదాయ శాఖాధికారుల నిబంధనల మేరకు లెక్కింపు జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

రేపు రక్తదాన శిబిరం

పెనుగంచిప్రోలు: స్థానిక జమ్మిచెట్టు రామాలయం వద్ద ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పెనుగంచిప్రోలు సబ్ బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94402 49518 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

నందిగామ టౌన్: రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను సైతం రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ సురేష్‌బాబు అన్నారు. మండలంలోని తొర్రగుడిపాడు, దాములూరు గ్రామాలలో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చెరుకూరు హైమారావు, గాదెల వెంకట రామారావు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రవాణాతో రహదారులు ఛిద్రం

- భారీ లోడులతో కుంగిపోతున్న రహదారులు
- రోడ్ల మధ్యలో గుంతలతో ప్రయాణికుల అవస్థలు
- చాలా చోట్ల పగిలిపోయిన తూములు, దెబ్బతిన్న కల్వర్టులు
- ఆదమరిస్తే భారీ ప్రమాదాలు జరిగే అవకాశం


పెనుగంచిప్రోలు చెరువు అలుగుల వద్ద రహదారి దుస్థితి

పెనుగంచిప్రోలు: ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లు అధిక లోడుతో తిరగటంతో గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. తారురోడ్లు మొత్తం పగుళ్లు రావటంతో పాటు కుంగిపోయాయి. దీంతో వాహనదారులు ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నారు. ఇసుక వాహనాల వల్లనే రోడ్లు దారుణంగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా పెనుగంచిప్రోలు-ముండ్లపాడు రోడ్డులో పెనుగంచిప్రోలు చెరువు అలుగుల వద్ద తుఫాన్ ధాటికి చప్టా కొట్టుకు పోవటంతో తాత్కాలికంగా మట్టితో పూడ్చారు. సుబ్బాయిగూడెం నుంచి ఇసుక టిప్పర్లు తిప్పటంతో అక్కడ గుంతలు పెద్దవి అవటంతో పాటు ప్రమాదకరంగా మారింది.

కల్వర్టులు, తూముల వద్ద ఏర్పడిన గుంతలు

మునేరు నుంచి మండలంలోని సుబ్బాయిగూడెం, శనగపాడు గ్రామాల నుంచి ఇసుక అధిక లోడుతో టిప్పర్లు తిప్పటం వలన రోడ్లు దారుణంగా ఉండటంతో పాటు పెనుగంచిప్రోలు-సుబ్బాయిగూడెం రోడ్డులో సుబ్బాయిగూడెం వద్ద కాలువ తూములు పగిలి పెద్ద రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారింది. శనగపాడు వద్ద వాగు కల్వర్టుపై పెద్ద రంధ్రం ఏర్పడింది. శనగపాడు-అనాసాగరం మధ్య కూడా పంట కాలువ చప్టాపై పెద్ద రంధ్రం పడింది. అక్కడ స్థానికులు ఏవో కర్రలు పెట్టారు. కానీ వాహనదారులు ఆదమరచి వస్తే మాత్రం పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణం రహదారుల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులను వివరణ కోరగా నిధులు మంజూరు కాగానే మరమ్మతు పనులు చేపడతామని చెప్పారు.


సుబ్బాయిగూడెం వద్ద ఛిద్రమైన రహదారి


శనగపాడు వద్ద వాగు చప్టాపై ఏర్పడిన గుంత

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- కోడి పందేల నిషేధం పోస్టర్ ఆవిష్కరణ
- పందేల బరులు ఏర్పాటు కాకుండా చూడాలి
- ఆర్డీఓ బాలకృష్ణ

సాక్షి ఎఫెక్ట్

నందిగామ టౌన్: కోడి పందేలు నిర్వహించటం చట్ట విరుద్ధమని, నిబంధనలను ఉల్లంఘించి పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ బాలకృష్ణ అన్నారు. 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన ''సిద్ధమవుతున్న పందెం బరులు'' కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో సమన్వయ శాఖల అధికారులతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా కోడి పందేల నిషేధంపై రాష్ట్ర పశుసంవర్ధక శాఖ రూపొందించిన పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్టు-1974 సెక్షన్-10, జంతు హింస నివారణ చట్టం 1960 సెక్షన్-34 ప్రకారం కోడి పందేలు నిషేధమన్నారు. చట్టాలను ఉల్లంఘించి కోడి పందేలు నిర్వహించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడి పందేలను నివారించేందుకు హైకోర్టు మార్గదర్శకాల మేరకు గ్రామ, మండల స్థాయిలో సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ బృందంలో గ్రామ స్థాయిలో వీఆర్వో, పోలీస్ కానిస్టేబుల్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఉంటారని, మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్‌హెచ్‌వో, మండల పశు సంవర్ధక శాఖాధికారి, ఈవోపీఆర్డీలు ఉంటారని తెలిపారు.

ఈ బృందాలు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రజల్లో అవగాహన కలిగించటంతో పాటు చట్టాల్లోని అంశాలను వివరించి కోడి పందేల నియంత్రణకు కృషి చేస్తారని చెప్పారు. పందేలు నిర్వహించటంతో పాటు పాల్గొనటం కూడా నేరమేనని, పందెం బరులు ఏర్పాటు చేయకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనల మేరకు తహసీల్దార్‌లు ఆయా పంచాయతీలకు నోటీసులు జారీ చేయాలని చెప్పారు. కోడి పందేలు నిర్వహించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయటంతో పాటు తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏసీపీ తిలక్, పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


కోడి పందేల నిషేధంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, అధికారులు

జూనియర్ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆహార భద్రతతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయం అని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. అందుకోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారని, తద్వారా 1,48,419 మంది ఇంటర్మీడియెట్ విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఇందునిమిత్తం రాబోయే మూడు నెలల కోసం తమ ప్రభుత్వం రూ.27.39 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. 2025-26వ సంవత్సరానికి మరో రూ.85.84 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. దీనివలన పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో టీడీపీ జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల అధ్యక్షులు కట్టా నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, డీసీ 4 కెనాల్ చైర్మన్ చిట్టూరి సుభాష్, టీడీపీ నాయకులు మాడుగుల సురేష్, పెంటేల నరేష్, కన్నా రవి, బొల్లు వెంకటేశ్వరరావు, కరణం శ్రీను పాల్గొన్నారు.

చలాన్లు చెల్లించేలా చూడాలి


చలాన్‌ల డ్రైవ్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ తిలక్

నందిగామటౌన్: పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్‌లను వాహనదారులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏసీపీ తిలక్ అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం పోలీసు సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన సెంటర్‌ల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ముఖ్యంగా వాహనాలపై ఉన్న ట్రాఫిక్ చలాన్‌లను తనిఖీ చేసి వెంటనే వాహనదారులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం గాంధీ సెంటరులో పెండింగ్ చలాన్‌ల వసూలుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఇసుక రవాణా, ర్యాగింగ్, బహిరంగ ప్రదేశాలలో మద్యపానం, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్న ప్రాంతాలలో డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ వైవీఎల్ నాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి కట్టెతో ప్రయోజనాలెన్నో

- అవగాహన లేమితో తగులబెడుతున్న రైతులు
- పంటకు మేలు చేసే పురుగుల నశింపుతో పాటు భూసారం తగ్గుదల


పొలంలో దట్టంగా రేగుతున్న మంటలు

వత్సవాయి: పత్తి పంట దాదాపు పూర్తికావచ్చింది. దీంతో పత్తి కట్టెను తొలగించి దాని స్థానంలో వేరే పంటను వేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అయితే ఈ పత్తి కట్టెను పొలంలోనే తగలబెట్టడం వల్ల రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ పత్తి కట్టెతో అనేక ప్రయోజనాలున్నాయి. దీనిపై అవగాహన లేని రైతులు పత్తి కట్టెను పొలాల్లో తగలబెడుతున్నారు. ఎండిన పత్తి కట్టెను అనేక రకాలుగా ఉపయోగించవచ్చునని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంట పూర్తయిన తరువాత కట్టెను తగలబెట్టడంతో పంటకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోవడంతో భూసారమూ తగ్గుతుంది. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో కలిపి ఈ ఏడాది 22 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. పత్తి పంట దిగుబడిపై శ్రద్ధ చూపించే రైతులు పంట పూర్తయిన తరువాత పత్తి కర్రను ఏం చేయాలన్న విషయాన్ని పెద్దగా పట్టించుకోరు. పొలాల్లోనే కుప్పలుగా వేసి తగలబెడతారు. కొంచెం శ్రద్ధ పెడితే పత్తి కర్ర వల్ల లాభాలు ఉన్నాయని గ్రహించవచ్చునని మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ చెబుతున్నారు. ఎకరం పత్తి పంటలో సుమారు ఒక టన్ను వరకు పత్తి కర్ర వస్తుంది. దీనిని పొలంలోనే తగలబెట్టి బూడిద చేయడం వల్ల భూసారం తగ్గడంతో పాటు రైతులకు తెలియకుండానే నష్టం జరుగుతుంది. పంటకు హాని చేసే పురుగులు తగ్గి కీడు చేసే పురుగుల సంతతి అంతకంతకు పెరుగుతుంది. భూసారం తగ్గడంతో భూమిలో బలం కోసం పెట్టుబడులు అధికంగా పెట్టి మందుల కట్టలు అదనంగా పెట్టాల్సి వస్తుంది. పత్తి కట్టె వల్ల కలిగే ప్రయోజనాల గురించి మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ పలు సూచనలు చేస్తున్నారు.

పత్తి కర్రతో ప్రయోజనాలు...

- కర్ర సైజును బట్టి యంత్రాల్లో వేసి నుజ్జు చేసి ఫ్లేవుడ్ తయారీలో వాడవచ్చు. ప్యాకింగ్ పేపర్, అట్టముక్కల తయారీకి ఎంతగానో ఉపయోగపడుతుంది.
- పత్తి కర్రను చిన్నచిన్న ముక్కలుగా చేసి వర్మీ కంపోస్టుగా మార్చుకుని పొలంలో చల్లుకోవచ్చు.
- రోటావేటర్‌తో కర్రను తొక్కించడం వల్ల చిన్న ముక్కలుగా మారి భూమిలో కలిసిపోతుంది. దీంతో భూమికి బలం పెరిగి సారవంతమవుతుంది. దీనివల్ల భూమిలో తేమశాతం నిల్వ ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- చాప్ కట్టర్‌తో ముక్కలుగా చేసి భూమిలో కలియదున్నాలి. ఒకటి, రెండు సార్లు పత్తి ఏరిన తరువాత గూడ లేకపోతే ట్రాక్టర్‌తో పంటను భూమిలోకి కలియదున్నితే పచ్చిరొట్టగా మారుతుంది.
- ఇవన్నీ చేయకున్నా పొలంలో పత్తి కర్రను తగలబెట్టకుండా చూసుకోవాలి. ప్రతి సంవత్సరం పొలంలోనే తగలబెట్టడం వల్ల భూసారం తగ్గుతుంది. మరలా బలం కోసం ఎరువులను విచ్చలవిడిగా వాడుకోవాల్సి వస్తుంది. దీంతో రైతులకు అదనంగా పెట్టుబడులు అవుతాయి.

వాట్సాప్ చేస్తే చాలు.. సమస్య పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదు
- ప్రజాసమస్యల పరిష్కార వేదిక నంబర్ 99481 46699

జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గానికి చెందిన ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలు గానీ, వ్యక్తిగత సమస్యలు గానీ ఉంటే స్వయంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా ఒక వాట్సాప్ మొబైల్ నంబర్‌తో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటుచేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యను క్లుప్తంగా ఒక దరఖాస్తు తయారుచేసి సంతకం చేసి దానిపై మీ మొబైల్ నంబర్ వేసి ఆధార్ కార్డును, దరఖాస్తును ఫొటో తీసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన వాట్సాప్ నంబర్ 99481 46699 కు పంపాలని తెలిపారు. అలా పంపిన దరఖాస్తును సంబంధిత శాఖకు ఆన్‌లైన్ ద్వారా పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో డీవైఈవో విచారణ

జగ్గయ్యపేట: నందిగామ ఇన్‌చార్జ్ డీవైఈవో వెంకటప్పయ్య సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై ఫిర్యాదులు రావటంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపడుతున్నామన్నారు. అనంతరం ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని, నూరు శాతం ఫలితాలు వచ్చేలా పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సిలబస్ పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

బహిర్భూమికి వెళ్లి బావిలో పడి దుర్మరణం

కంచికచర్ల: ఓ వ్యక్తి బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందిన సంఘటన మండలంలోని మోగులూరులో సోమవారం తెల్లవారు జామున జరిగింది. పోలీసుల కథనం మేరకు మండలంలోని మోగులూరు గ్రామానికి చెందిన బంకా మరియదాసు(40) సోమవారం తెల్లవారుజామున సమీపంలోని పొలాల్లోకి బహిర్భూమికి వెళ్లాడు. బావిలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఎన్డీఆర్ఎఫ్ బృందం వచ్చి మరియదాసు మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పుల సవరణకు అవకాశమివ్వాలి

వీరులపాడు: కులగణన జాబితాలో తప్పుల సవరణకు అవకాశం కల్పించాలని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు మందా పిచ్చయ్య మాదిగ అన్నారు. కులగణనలో జరిగిన తప్పుల సవరణకు అవకాశంతో పాటు గడువు తేదీ పొడిగించాలని కోరుతూ మండలంలోని జుజ్జూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో నిర్వహించిన కులగణన సర్వేలో కులం, మతం పేర్లు తప్పుగా నమోదయ్యాయన్నారు. ప్రభుత్వం స్పందించి సమయం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విష్ణువర్ధన్, రమేష్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు



నవాబుపేట(పెనుగంచిప్రోలు): మండలంలోని నవాబుపేట గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి నూతన ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ నిర్మాణానికి గత ప్రభుత్వంలో శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. వాటికి తోడు పలువురు దాతలు, భక్తులు సుమారుగా రూ.కోటి వెచ్చించి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. కొద్ది రోజుల్లో ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహాలు ఇప్పటికే గ్రామానికి వచ్చాయని సభ్యులు తెలిపారు.

సంక్రాంతి పండుగకు సంప్రదాయ క్రీడలు నిర్వహించాలి

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): సంక్రాంతి పండుగకు సంప్రదాయ క్రీడలు నిర్వహించాలని పట్టణ ఎస్ఐ-2 వెంకటేశ్వరరావు అన్నారు. గ్రామంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు పండుగలలో సంక్రాంతి అతి పెద్ద పండుగన్నారు. స్నేహపూరిత వాతావరణంలో క్రీడలను నిర్వహించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆటల పోటీల నిర్వాహకులు నాగమణి, రామనాథం, లింగారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం ద్వారా రూ.13.90 లక్షల ఆదాయం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయానికి బహిరంగ వేలం పాట ద్వారా రూ.13.90 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో సురేష్‌బాబు తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో సోమవారం కూల్‌డ్రింక్స్, స్వామి వారి చిత్రపటాలు అమ్ముకునే హక్కుకు వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో గ్రామానికి చెందిన శ్రీనివాసరావు హెచ్చు పాటదారుగా నిలిచి పాటను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచనల్లో వైవిధ్యం.. ఆవిష్కరణలు అద్భుతం





విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టుకు మార్కులు వేస్తున్న జడ్జిలు

కొత్త ఆలోచనలు.. కొంగొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు సత్తా చాటారు. తమ నైపుణ్యానికి సృజనాత్మకతను జోడించి వైవిధ్యమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ వేదికగా నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్‌లో వీటిని ప్రదర్శించారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గణేష్‌కుమార్ సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ ఫెస్ట్‌లో.. రాష్ట్రంలోని 107 పాలిటెక్నిక్‌ల నుంచి 249 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన విద్యార్థులు తిలకిస్తు న్నారు. మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగనుంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భూముల సమస్యల పరిష్కారానికే సదస్సులు

చట్టన్నవరం(వీరులపాడు): రెవెన్యూ సదస్సులతో రైతుల భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ హుస్సేన్ అన్నారు. మండలంలోని చట్టన్నవరం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు 20 అర్జీలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతీ దేవి, సర్పంచ్ చలమల దుర్గయ్య, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.